

నిందితుల కోసం గాలింపు

పుల్లలపాడులో తుపాకీతో దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకరరావును హత్యచేసిన కేసులో నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

8 లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తాళ్లపూడి మండలం వేగేశ్వరపురానికి చెందిన వీరమల్లు సూర్యనారాయణ, లక్ష్మీ సూర్యవతి దంపతులు బుధవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 3,900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,300, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికల యూనిట్స్ కేంద్రం తనిఖీ



ఎన్నికల సామగ్రి కేంద్రం వద్ద కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్‌లో ఎన్నికల యూనిట్స్ కేంద్రాన్ని కలెక్టర్ మాధవీలత బుధవారం పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. గోడౌన్స్‌లోని ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, ఇతర ఎన్నికల సామగ్రిని, అక్కడి భద్రత చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీ ప్రక్రియలో భాగంగా కేంద్రాన్ని సందర్శించామన్నారు. గోడౌన్స్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, అర్బన్ తహసీల్దార్ వి.సుస్వాగతం, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాయుడు గణేష్ (వైఎస్సార్ సీపీ), చంద్రశేఖర్ (టీడీపీ), రామచంద్రరావు (బీజేపీ), రమేష్ (కాంగ్రెస్) ఉన్నారు.

పింఛన్ సొమ్ము విడుదల

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లాలోని 2,42,401 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.66.90 కోట్లు విడుదల చేసిందని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీణాదేవి తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీ వేకువజామునుంచే వలంటీర్లు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

2, 3 తేదీల్లో ఓటు నమోదు శిబిరాలు



సమావేశంలోపాల్గొన్న డిఆర్‌ఓ నరసింహులు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, చేర్పులు, మార్పులపై నవంబర్ 22 నుంచి 29 వరకూ నియోజకవర్గాల వారీగా జిల్లాలో కొనసాగిన ప్రక్రియపై రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో చర్చించామని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు అన్నారు. తన చాంబర్‌లో బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్‌లో పది మందికి పైగా ఓటర్లు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం డిసెంబర్ 2, 3 తేదీల్లో జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎన్నికల సెక్షన్ ఆర్ఐ గిరీష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్ఎస్ మూర్తి (సీపీఎం), కె.రాజశేఖర్ (వైఎస్సార్ సీపీ), బి.రామచంద్రరావు (బీజేపీ), ఎన్.రమేష్ (కాంగ్రెస్) పాల్గొన్నారు.

హెచ్ఎం నరసమాంబకు జాతీయ పురస్కారం



నరసమాంబ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు సంతోష్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేవీఎల్ఎన్ నరసమాంబ తయారు చేసిన ప్రాజెక్టుకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ విద్యామృత్ మహోత్సవ్ పోటీలకు జాతీయ స్థాయిలో మనరాష్ట్రం నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అందులో నరసమాంబ తయారు చేసిన లెక్కించుట, కూడుట, తీసివేయుట అనే ప్రాజెక్టు ఉంది. విద్యామంత్రిత్వశాఖ, ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన ఇన్నోవేటివ్ పెడగోజిపై దేశవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో 27 రాష్ట్రాల నుంచి 5.99 లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొత్తం పది ప్రాజెక్టులు ఎంపిక కాగా, అందులో మొదటి, ఎనిమిదో ప్రాజెక్టు (నరసమాంబ)లు మన రాష్ట్రం నుంచి ఉన్నాయి. కాగా.. నరసమాంబను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, రూరల్ ఎంఈవోలు అయ్యంకి దుర్గాతులసీదాస్, బి.చందు కుమార్ అభినందించారు.

‘కంటి’కి రెప్పలా..



- పేదల కంటిచూపునకు ప్రభుత్వ భరోసా
- జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచిత వైద్య సేవలు
- అవసరమైన వారికి ఆస్పత్రుల్లో కేటరాక్ట్ ఆపరేషన్‌లు
- పరీక్షలు, మందులు, ఆపరేషన్లు అన్నీ ఉచితమే
- శిబిరాలకు భారీగా తరలివస్తున్న కంటి బాధితులు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఎన్ రాఘవమ్మకు కళ్లు అసలు కనిపించడం లేదు. అడుగు తీసి అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. దీనికి తోడు వృద్ధాప్య భారం. కుటుంబ సభ్యులు కూడా తమ ఆర్థిక పరిస్థితులు సహకరించక ఆమెను కంటి వైద్యుని దగ్గరకు తీసుకు వెళ్లలేకపోతున్నారు. ఈనేపథ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని తెలుసుకున్నారు. వలంటీరు సహాయంతో శిబిరం జరుగుతున్న చోటుకు తీసుకువెళ్లారు. వైద్యులు ఆమెను పరీక్షించారు. ఆరోగ్య శ్రీకింద చికిత్సకు దగ్గరలోని ఆస్పత్రికి రిఫర్ చేశారు.పదిరోజుల కిందట ఆమెకు ఆపరేషను చేశారు. రాఘవమ్మతో పాటు కుటుంబ సభ్యులు సంతోషిస్తున్నారు.

75ఏళ్ల రంగారావుది కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. ప్రభుత్వ పెన్షనే ఆధారం. కొన్నాళ్లుగా వృద్ధాప్యం కారణంగా చూపు మందగించింది. కంటి పరీక్ష చేయించుకుందామంటే దారి లేదు. పెద్దాస్పత్రికి వెళ్తే చూస్తారో లేదో కూడా తెలియదు. దీంతో కనీకనిపించని కళ్లతోనే జీవితాన్ని నెట్టుకొచ్చేస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ఇంటికి వలంటీరు వచ్చింది. ఇంట్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలున్నాయా అని అడిగింది. రంగారావు తన కంటి సమస్య చెప్పాడు. ఆమె వివరాలు రాసుకుని టోకెన్ ఇచ్చింది. దాని ప్రకారం దగ్గర్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లాడు. కంటి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. పైసా తీసుకోకుండానే కళ్లజోడు ఇచ్చి పంపించారు. ఆ వృద్ధుడు కళ్లలో కనిపించిన ఆనందం అంతా ఇంతా కాదు.

సాక్షిప్రతినిధి,కాకినాడ : సర్వేంద్రియానం నయనం ప్రదానం అంటారు పెద్దలు. శరీరంలో అత్యంత ముఖ్యమైనది కన్ను. అందుకే ఈ అవయవానికి ప్రభుత్వం కూడా చాలా ప్రాధాన్యతనిస్తోంది. కంటి వైద్య సేవలను జనరల్ సేవల్లోకి కాకుండా సూపర్ స్పెషాలిటీ సేవా విభాగంలోకి తీసుకు వచ్చారు. వయోభారం మీదపడ్డ వారికి కంటి సమస్య సాధారణం. కనుపాపకు ఇబ్బంది వస్తే జీవితమే అంధకారమవుతుంది. కాస్త ఆర్థిక స్తోమతున్న వృద్ధులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఎప్పటికప్పుడు కళ్లు చెక్ చేయించుకుంటారు. అవసరమైతే శస్త్ర చికిత్స చేయించుకుంటారు. మరి అదే సమస్య పేదింటి వృద్ధునికి వస్తే ..చాలా కష్టంగా ఉంటుంది జీవితం. ఇంట్లో చెప్పుకోలేక..చేతిలో డబ్బులు లేక చీకటిలోనే తమ బతుకులు అని సరిపెట్టుకుంటారు. అలాంటి వృద్ధులకు ఇక ఇబ్బంది లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను ఇంటికెళ్లి మరీ వలంటీరు సేకరిస్తున్నారు. దగ్గరలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించినప్పుడు వీరిని శిబిరంలో ఆప్తమాలజిస్టు పరీక్షిస్తున్నారు. ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తున్నారు. అవసరమైన మందులు ఇస్తున్నారు. అవసరమైతే వీరి శస్త్రచికిత్సల బాధ్యతను కూడా తీసుకుంటోంది.

కంటి చూపు సమస్యతో బాధ పడుతున్న అన్ని వయసుల వారికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలందిస్తున్నారు. అవసరమైన వారికి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.40వేల నుంచి రూ.50వేలు ర్చు పెడితే కాని జరగని కంటి శస్త్ర చిక్సితలు ఈ శిబిరాల ద్వారా చేస్తున్నారు. కంటి రోగులకు సంబంధించి శిబిరాల్లో విశేషమైన స్పందన లభిస్తోంది. డాక్టర్ కన్సెల్టెన్సీ ఫీజు దగ్గర నుంచి సుమారు రూ.10 వేలు విలువైన కంటి ఆపరేషన్ వరకూ సేవలన్నీ ఆరోగ్య శ్రీలో ఉచితమే. రూ.1000 నుంచి రూ.1500 విలువైన కళ్ళద్దాల వరకూ ఉచితంగా ఇస్తుండటంతో రోగులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ మొదలు సమస్య పరిస్కారమయ్యే వరకు అన్ని రకాల సేవల వివరాలు ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. జగనన్న శిబిరంలో కంటిరోగికి తొలుత దూరపు చూపు లోపం గుర్తించేందుకు మోనోక్యూలర్ టెస్ట్ చేస్తున్నారు. 60 శాతం కంటే తక్కువ సామర్థ్యం ఉంటే కంటి నుంచి మెదడుకు వెళ్లే నరాల తీరుపై దృష్టి పెడుతున్నారు. సాధారణ స్థాయిలో పరిష్కారమవుతుందనుకుంటే కంటి అద్దాలను ఇస్తున్నారు. ఎంపిక చేసిన రోగులను కేటరాక్ట్ ఆపరేషన్ కోసం ఆస్పత్రులకు పంపిస్తున్నారు. అక్కడ పరీక్షలు చేశాక కొందరిలో సమస్య తీవ్రతను గుర్తించి సర్జరీ చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ లో సర్జరీ చేయించుకున్న వారం రోజుల తర్వాత మరోసారి పరీక్షిస్తున్నారు.



రాజమహేంద్రవరం రూరల్‌లో కంటి పరీక్షలు

కంటి వైద్య సేవలు పొందిన రోగుల గణాంకాలు

జిల్లా	పరీక్షలు	మందులు	కళ్ల అద్దాలు అవసరం	పొందినవారు
కోనసీమ	47,721	13,293	32,169	1894
కాకినాడ	40,888	11,934	25444	1514
తూర్పుగోదావరి	37101	06585	27208	3081

కేటరాక్ట్ సర్జరీల గణాంకాలు

జిల్లా	గుర్తించిన కేసులు	సర్జరీ చేసినవి	చేయాల్సినవి
కోనసీమ	1994	174	1820
కాకినాడ	3070	221	2849
తూర్పుగోదావరి	2777	175	2602

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్



చాన్నాళ్లుగా కళ్లు కనిపించక ఇబ్బందులు పడుతున్నాను. ఊళ్లో జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతుందని ముందుగా వైద్య సిబ్బంది మా ఇంటికి వచ్చి పరీక్షలు చేశారు. ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ అంటే భయపడ్డాను. పైసా ఖర్చవ్వదని చెప్పారు. పరీక్షలు చేయించి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అయ్యాక రెండు రోజులకు ఒకసారి ఇంటికి వచ్చి చూసి వెళుతున్నారు.

– ఇసుకపాటి లక్ష్మి, ఓదూరు,రామచంద్రపురం మండలం

వారానికి 80 సర్జరీలు



గతంలో వారానికి 25 సర్జరీలు చేసే వాళ్లం. జగనన్న ఆరోగ్య సురక్ష నుంచి వస్తున్న కేసులతో వారానికి 65 నుంచి 80 వరకు కేటరాక్ట్ సర్జరీలు చేస్తున్నాం. కంటి సమస్యలు చూపించుకునే చిన్న పిల్లల సంఖ్య బాగా పెరిగింది. అది పూర్తిగా పాడైనప్పుడు మాత్రమే తెలుస్తుంటుంది. చూపు పూర్తిగా కోల్పోయే స్థితి నుంచి రోగులను కాపాడగలుగుతున్నాం.

– ప్రొఫెసర్ ఎస్ రమాభారతి, ఆప్తాలజీ హెడ్.,జీజీహెచ్

వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ



తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కోరుకొండ మండలం కాపవరంలో జరిగిన బహిరంగసభకు హాజరైన జనం

- టీడీపీ, జనసేనలను ప్రజలు నమ్మరు
- మంత్రి అంబటి రాంబాబు

మధురపూడి/రాజానగరం: రాష్ట్రంలో వ్యవసాయం రంగం అభివృద్ధికి, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలో రూ.91.10 కోట్లతో చేపట్టే తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ పనులకు, రూ.38 కోట్లతో చేపట్టే చిన్న నీటిపారుదల అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే 1,510 మంది పేదలకు నివాస స్థలాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు వ్యవసాయ దండగ అంటూ ఆ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో వ్యవసాయరంగం అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తూ వ్యవసాయాన్ని ఒక పండుగలా చేసి చూపారన్నారు. స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కూడా నియోజకవర్గంలో వ్యవసాయాభివృద్ధికి శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. వరద ముంపును పూర్తి స్థాయిలో నివారించేందుకు తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ తోడ్పడుతుందన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా కోరుకొండ, సీతానగరం మండలాలలో 53 చెరువుల అభివృద్ధితోపాటు 13 వేల మంది రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.

కొత్తగా గ్రామాల ఆవిర్భావం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంతో ప్రజారంజకంగా జరుగుతుందని మంత్రి అంబటి పేర్కొన్నారు. నివాస స్థలాలు లేక పేదలు పడుతున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఒకేసారి 31.70 లక్షల మందికి నివాస స్థలాలను అందజేసి రికార్డు సృష్టించారన్నారు.కాపవరం, పశ్చిమగానుగూడెం, కోరుకొండకు చెందిన 1,510 మందికి నివాస స్థలాల కోసం కాపవరంలో 31 ఎకరాలను కేటాయించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 99.5 శాతం హామీలను అమలు ఆదర్శంగా నిలిచారన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి కావడం వల్లనే కరోనా వైరస్ సమయంలో కూడా సంక్షేమ పథకాలను ఆపకుండా ప్రజలకు అండగా నిలిచారన్నారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న పోరు రాబోయే ఎన్నికలు పేదలకు పెత్తందార్లకు మధ్య జరుగుతున్న పోరాటంగా మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ప్రజాబలంతో దూసుకుపోతున్న జగన్ సర్కార్‌ని నేరుగా ఎదుర్కొనే ధమ్ము, ధైర్యం లేకనే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తెలంగాణలో పోటీ చేయకుండా బహిరంగంగా కాంగ్రెస్‌కి మద్దతు పలుకుతుంటే, జనసేనాని పవన్ కల్యాణ్ బీజేపీకి మద్దుతు పలుకుతున్నారు. దుష్టశక్తులైన టీడీపీ, జనసేన, ఎల్లోమీడియాలను ప్రజలు నమ్మే పరిస్థితులు లేవన్నారు. రాబోయే ఎన్నికలలో మరోసారి విజయదుందుబి మ్రోగించి, అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీయేనని అంబటి పేర్కొన్నారు.

రైతులకు మేలు చేకూర్చేలా పథకాలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రైతాంగానికి మేలు చేకూర్చేలా పలు పథకాలు అమలు చేస్తూ వ్యవసాయం దండుగ కాదు పండుగ అని నిరూపించారన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా రూ.45 కోట్లతో చేపట్టే పనులకు వర్చువల్ ద్వారా శంకుస్థాపనలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు మేడా గురుదత్తప్రసాద్, అడపా కనరాజు, కంటే వినయ్‌తేజ, గండి నానిబాబు, ఉండమట్ల రాజబాబు, దూలం పెద్ద, కొండపల్లి దుర్గారావు, కల్యాణం రాంబాబు, మండపానికి శ్రీను, ఆర్డీఓ చైత్రవర్షిణి, తహసీల్దారు పాపారావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాసరావు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కిసాన్ మేళాను వినియోగించుకోవాలి



కిసాన్ మేళాను ప్రారంభిస్తున్న హోంమంత్రి తానేటి వనిత

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్వహిస్తున్న మెగా కిసాన్ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. రాజమహేంద్రవరంలో రీజినల్ కార్యాలయంలో బ్యాంక్ అధికారులతో కలిసి బుధవారం ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బ్యాంక్ నిర్వహించే వివిధ వ్యవసాయ కార్యక్రమాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ దినేష్ పంత్ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవసాయ వినియోగదారులకు బలమైన సుస్థిరతను కలిగించేందుకు సేవలందిస్తుందన్నారు. ఈనెల 30వ తేదీ వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ వినియోగదారుల బ్యాంకింగ్, ఫైనాన్సింగ్ అవసరాలను తీర్చడానికి కృషి చేస్తామన్నారు. తమ బ్యాంకు హైదరాబాద్ జోన్‌లో 413 శాఖలను కలిగి ఉందన్నారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, పశుసంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్, ఫార్మలైజేషన్ వంటి వివిధ ఆత్మనిర్భర్ భారత్ పథకాలను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కలవచర్లలో పారిశ్రామికవాడ

- రూ.20.64 కోట్ల అంచనా నిధులతో ఏర్పాటు
- వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన సీఎం



కలెక్టరేట్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎంఎస్ఈ – సీడీపీ నిధులు రూ.20.64 కోట్లతో రాజానగరం మండలం కలవచర్లలో చేపట్టనున్న నూతన పారిశ్రామిక వాడకు తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బుధవారం శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ క్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు అధికారులు అన్నివిధాలా అందుబాటులో ఉంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) లిమిటెడ్ కోసం రూ.20.64 కోట్ల అంచనాతో మంజూరు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టును కలవచర్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సంబంధిత అంచనా వ్యయంతో ప్రధాన కార్యాలయానికి సమర్పించామన్నారు. ఎంఎస్ఈ – సీడీపీ కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ రూ.10.50 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ గ్రాంట్ రూ.10.14 కోట్లతో ప్రాజెక్ట్ ప్రతిపాదించడం జరిగిందన్నారు. అంతర్గత రహదారులు, మురుగునీటిపారుదల వ్యవస్థ, ముందస్తు నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలియ చేశారు.

యువతకు ఉపాధి అవకాశాలు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గడచిన నాలుగున్నర ఏళ్లలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు జరుగుతున్నాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కలవచర్లలో 104 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు నిధులు సమకూర్చడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇటీవలే కోరుకొండ మండలం రాజవరం గ్రామంలో నిర్మించే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు వర్చువల్ విధానంలో సీఎం జగన్ శంకుస్థాపన చేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎంపీపీ ఎం.వీర్రాజు, జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్లు డీవీఎస్ఎన్ జ్యోత్స్నాదేవి, బి.రాధామణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కమ్మని మామిడి.. తిందాం పదండి



మామిడి చెట్టుకు కాసిన కాయలు

పిఠాపురం: మార్చి రాకుండానే మామిడి పండ్లు ఏమిటి అనుకుంటున్నారా..! అవును నిజమేనండి. కొత్తపల్లిలో యువ రైతు ఉల్లి సురేష్ తన పొలంలో మూడేళ్ల కిందట నాటిన మామిడి చెట్టు ఇప్పుడు కాపు కాస్తోంది. గత నెల రోజులుగా సుమారు 50 మామిడి పండ్లు కాసినట్లు సురేష్ తెలిపారు. ఇది పందిరి మామిడి రకానికి చెందిన చెట్టు అని వివరించారు.

మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో 17 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 1న కాకినాడ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్, ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఇంట్లోకి చోర్‌బడకుండా..

- చోరీల నివారణకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం
- వినియోగించుకోవాలంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: సెలవులు వచ్చాయని.. పెళ్లిళ్లకని... బంధువుల ఇంటికని ఇతర ఊళ్లకు వెళ్లేవారికి ఎప్పుడూ గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి.. ఇంటికి తాళం వేసి వెళ్తున్నా వచ్చేసరికి ఏం జరుగుతుందోననే భయం ఉంటోంది. ఎందుకంటే తాళాలు బద్దలు కొట్టి ఇంటిని గుల్ల చేస్తున్న ప్రబుద్ధులు ఉంటుండగా, ఇలా జరుగుతున్న ఘటనలు కోకొల్లలు. అలాంటి భయం, ఆందోళనకు చెక్ పెట్టేలా 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం'ను పోలీసు వ్యవస్థ తీసుకొచ్చింది. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పోలీసులు కోరుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా దొంగతనాల నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం 'లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం' (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచిస్తున్నారు. సెలవులపై వేరే ప్రదేశాలు, తీర్థ యాత్రలు, ఇతర శుభకార్యాలకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలని, ఇంట్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఈ సిస్టం వినియోగించుకోవాలని అంటున్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్, రిక్వెస్ట్ పోలీసు వాచ్‌ను ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఎలా చేయాలో ఆయన వివరించారు. అవి ఇలా..

ఏం చేయాలంటే..

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను ముందుగా ఆండ్రాయిడ్ యూజర్స్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐ ఫోన్ యూజర్స్ యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేయాలి.
- ఈ యాప్‌లో వినియోగదారులు ముందుగా తమ పేరు, మొబైల్ నంబరు, చిరునామా వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్‌ను ఆ ఇంటి వద్దే ఉండి చేస్తే ఆటోమేటిక్‌గా ఇంటి లాంగిట్యూడ్, లాటిట్యూడ్ కూడా పోలీసు వారి వద్ద నమోదవుతుంది. వెంటనే వారి మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయగానే ఒక వినియోగదారునిగా పోలీసు వద్ద నమోదు అయినట్టు ఒక రిజిస్ట్రేషన్ నంబరు కూడా వస్తుంది.
- ఆ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించి ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి బయటకు వెళుతున్నప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌లో ఫలానా తేదీ నుంచి ఎన్ని రోజులు ఊరు వెళ్తున్నారో వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.
- ఆండ్రాయిడ్ మొబైల్ లేని వినియోగదారులు, ఆండ్రాయిడ్ మొబైల్స్‌ను ఆపరేట్ చేయలేని వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ఫోన్ నంబర్లు 94932 06371, 99084 54580కు తెలియజేయాలి. వెంటనే వినియోగదారుల ఇంటికి పోలీసు వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమేరా అమర్చుతారు.
- కెమేరాను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానిస్తారు. అప్పటి నుంచి ఆ ఇల్లు పోలీసు నిఘాలో ఉంటుంది.
- ఆ ఇంట్లోకి ఎవరైనా దొంగలు ప్రవేశిస్తే కెమేరా పనిచేయడం ప్రారంభించి ఫోటోలు, లైవ్ వీడియోను పోలీసు కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. అలాగే కంట్రోల్ రూమ్‌లో ఒక అలారం మోగుతుంది. తద్వారా పోలీసు స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది నిమిషాల వ్యవధిలోనే దొంగతనాన్ని అరికట్టి, దొంగను పట్టుకుంటారు.



లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ పోస్టర్



ఈ సేవలు.. పూర్తి ఉచితం



లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా అందిస్తున్న సేవలు పూర్తిగా ఉచితం. దొంగతనం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే ముందుగానే ప్రజలు స్పందించి ఈ సేవలను వినియోగించుకోవాలి. దీనిపై ఇప్పటికే పోలీసులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. బయట ఊళ్లకు వెళ్లే వారు తమ విలువైన సామగ్రిని భద్రపరుచుకోవాలి.

–పి.జగదీష్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

3 నుంచి గుంటూరులో అగ్రిటెక్–2023

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 3, 4, 5 తేదీలలో గుంటూరు లాంలో అగ్రిటెక్–2023 నిర్వహిస్తామని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై సదస్సు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారదాజయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఇతర మంత్రులు తదితరులు పాల్గొంటారన్నారు. తొలిరోజు ఆధునిక వ్యవసాయం సాంకేతికతపై సదస్సు, వ్యవసాయ విద్యా దినోత్సవం, అతిథుల సందేశం, వ్యవసాయ పరిశ్రమల నిధులతో నూతన ఆవిష్కరణలపై ముఖాముఖి, సాగులో డ్రోన్‌లు, రోబోలు– క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. రెండో రోజు లాభసాటి వ్యవసాయం కోసం నూతన పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల గురించి చర్చ, సాగు ఖర్చు తగ్గించి ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు తదితరాలపై శాస్త్రవేత్తల సందేశాలు ఉంటాయన్నారు. మూడో రోజు చిరుధాన్యాలు–సిరి మరియు పోషక ధాన్యాల గురించి వివరిస్తామన్నారు. అంతే కాకుండా వ్యవసాయంలో సాధించిన ప్రగతి, యాంత్రీకరణ, నూతన వంగడాలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

సైకాలజీపై అధ్యయనం చేయాలి

రాజానగరం: మానసిక ప్రశాంతతతో ఆలోచిస్తూ సైకాలజీపై అధ్యయనం చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. స్థానిక యూనివర్సిటీలో సొసైటీ ఫర్ రీసెర్చ్ అండ్ యాక్షన్, స్పృహ సైకాలజీ విభాగం, రాజమహేంద్రవరం రోటరీ క్లబ్, జీఎస్ఎల్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. 'సంపూర్ణత ద్వారా శ్రేష్టత' అనే అంశంపై స్పోర్ట్స్ సైకాలజీ, పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్, 'నిద్ర సమస్యలు– ఆరోగ్యం' అనే అంశంపై అపోలో ఆస్పత్రి (హైదరాబాద్) వైద్యుడు చెన్నంశెట్టి విజయకుమార్ ఉపన్యసించారు. వివిధ సంస్థలు, కళాశాలలకు చెందిన 235 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, నిర్వహణ కార్యదర్శి సుంకర నాగేంద్రకిశోర్, సభ్యులు గూడూరి రాధిక, రాజేష్ ఖన్నా, బాడిస శ్రీనివాస్, చండీప్రియ, సైకాలజీ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణ నక్కిన, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్ పడాల, డాక్టర్ కృష్ణభవాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్

హత్య కేసులో నిందితుల కోసం గాలింపు

- ఎనిమిది ప్రత్యేక బృందాల ఏర్పాటు
- కొవ్వూరు డీఎస్పీ వర్మ వెల్లడి

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడులో మంగళవారం రాత్రి తుపాకీతో దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకరరావును హత్యచేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసేందుకు ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ వర్మ వెల్లడించారు. బుధవారం ఆయన పుల్లలపాడులో మృతుని కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాల కారణంగానే ఈ హత్య జరిగినట్లు భావిస్తున్నామన్నారు. కక్ష కట్టిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. అనంతరం గ్రామానికి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా? వస్తే ఏ వాహనంలో వచ్చారు? ఎంతమంది వచ్చారనే విషయాలను ఆయన స్థానికుల నుంచి తెలుసుకున్నారు. ఆ రోజు సాయంత్రం చీకటి పడే సమయంలో పెద్ద సైజు తెల్లకారు వచ్చిందని, దాంట్లోంచి ఒక వ్యక్తి దిగి ప్రభాకరరావు ఇంటి వైపు వెళ్లి కొద్దిసేపట్లోనే వెనుతిరిగినట్లు గ్రామస్తులు వివరించారు. సాధారణంగా ప్రభాకరరావు ఇంటికి రోజూ అదే సమయంలో ఎవరో ఒకరు వస్తుంటారని, అదే రీతిలో వచ్చి ఉంటారని అనుకున్నామన్నారు. బుల్లెట్ శబ్దం వచ్చినా అది దీపావళి టపాసుల మోతగా భావించినట్లు వివరించారు.



పుల్లలపాడులో విలేకరులతో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ వర్మ

లెక్క చూడాలని వచ్చి..

హత్యకు గురైన ప్రభాకరరావు తన చాతుర్యంతో చాలాచోట్ల, చాలా సందర్భాల్లో నెగ్గుకు వచ్చారు. మంగళవారం సాయంత్రం 6.15 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన బాకీ పద్దు ఎంతో లెక్క చూడాలని అని చెప్పి, చివరకు ప్రభాకరరావును హతమార్చినట్లు మృతుని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డైట్ కళాశాలలో వచ్చే నెల 11, 12వ తేదీల్లో కళా ఉత్సవ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల ప్లస్‌లలో 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. గాత్రంలో సంగీతం, జానపదం, వాయిద్య సంగీతంలో వాయిద్య, మెలోడి, నాట్యంలో సంప్రదాయ, జానపద విభాగాల్లో పోటీలు డిసెంబర్ 11న ఉంటాయన్నారు. దృశ్య కళల్లో ద్విమితీయ, త్రిమితీయ, సంప్రదాయబద్ధ ఆట బొమ్మలు అండ్ ఆటలు, నాటిక (ఏకపాత్రాభినయం) విభాగాల పోటీలు 12న నిర్వహిస్తామన్నారు. ఒక విద్యాసంస్థ నుంచి ఒక్కొక్క కళా రూపంలో ఒక బాలుడు, ఒక బాలిక (విడివిడిగా) పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పాల్గొనే విద్యార్థులు అవసరమైన సామగ్రి తెచ్చుకోవాలన్నారు. పాఠశాల తరఫున పాల్గొనే వారి వివరాలను, పోటీ అంశాలను ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు ఈ–మెయిల్ gdieteg@gmail.comకు డిసెంబరు 8వ తేదీలోగా పంపి రిజిస్టర్ చేయించుకోవాలని రమణ తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు అధ్యాపకులు కె.గంగాధరరావు (94403 39416), ఎస్.బాలరాజు (89196 91293)ను సంప్రదించాలన్నారు.

నేడు ధర్మపథం కార్యక్రమం



ధర్మపథం కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్రేయపురం: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ధర్మపథం కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. గ్రామ, గ్రామాన హిందూ, సనాతన ధర్మం ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మపథం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అయినవిల్లి వినాయకుని అభిషేకం, హోమం, వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దీనికిగాను ఆత్రేయపురం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను బుధవారం పారిశ్రామికవేత్త మేడపాటి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, చిలువూరి బాబిరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి భక్తులంతా విచ్చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

రాయవరం: కోనసీమ జిల్లా వ్యాప్తంగా నవంబర్ నెలకు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 50 శాతం మంది హాజరయ్యారు. సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్, హిందీ సబ్జెక్టు ఉపాధ్యాయులకు నిర్వహించారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 39, సబ్జెక్టు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు 48 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. వీటిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, రామచంద్రపురం డీవైఈఓ నరసింహఫణి, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, మొయినుద్దీన్ సందర్శించారు.



హిందీ సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



రాష్ట్ర బాస్కెట్‌బాల్ మహిళల జట్టు



పురుషుల జట్టు

రామచంద్రపురం: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్టు రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగిన 8వ పురుషుల, మహిళల అంతర్ జిల్లాల పోటీల్లో 24 మంది పురుషులు, 24 మంది మహిళలను ఎంపిక చేశారన్నారు. వారికి చిత్తూరులో కోచింగ్ క్యాంప్‌ను నిర్వహించి అందులో నుంచి 12 మంది మహిళలు, 12 మంది పురుషుల జట్లను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశామని చక్రవర్తి వివరించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ పంజాబ్‌లోని లూథియానాలో జరిగే 73వ జాతీయ స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. ఏపీ పురుషుల జట్టుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ కోచ్ వీఆర్ రుద్ర, మహిళల జట్టుకు గేమ్‌పాయింట్ కోచ్ పి.శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ కోచ్ పి.సుకన్యలు కోచ్‌లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరీ టి.చెంగలరాయుడు, సెలక్షన్ కమిటీ ప్రెసిడెంట్ ఎన్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు వీరే..

పురుషుల జట్టులో గూడుపు గణేష్, ఐబీపీసీహెచ్ వర్మ, బి.పవన్‌కుమార్, జి.అరవిందవర్మ, ఎస్.ఇమ్రాన్, ఎస్‌కే ఆలీషా, జి.సత్యప్రకాశ్, వీఎస్ దుర్గాప్రసాద్, ఎస్.ఇంతియాజ్, జి.అనిల్, కె.ద్వారకాంత్‌రెడ్డి, కె.జయకృష్ణ ఉన్నారు. మహిళల జట్టుకు బి.లీలావతి, ఆర్.మహతి, వీఆర్సీ యాదవ్, వి.సోహనా, బి.భవానీదేవి, బీవీ దుర్గ, బి.కుసుమ కుమారి, మహ్మద్ హాఫీజ్, జి.సంధ్య, డి.ప్రభుదీపిక, ఎన్.వెంకటలక్ష్మి, ఒ.కుందన ఎంపికయ్యారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డిసెంబర్ 1 నుంచి 3 వరకూ డెహ్రాడూన్‌లో జరిగే 37వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు సంఘ కార్యదర్శి బి.అర్జునరావు బుధవారం తెలిపారు. టీసీఎస్ శ్రీచరణ్, ఎ.దినకర్, డి.ధనుష్, బి.అనుదర్శిత్, కేవీ నరసింహమూర్తి, బి.హర్షవర్ధన్, ఆర్‌హెచ్‌వీ మూర్తి, కె.లాస్య, జి.లాహితితేజ, వై.ఆశ్రిత, పూజితాదేవి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 18, 19 తేదీలలో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించారన్నారు. వీరిని జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, తైక్వాండో సంఘ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, రిఫరీలు సత్యనారాయణ, తులసి, మూర్తి, కేవీ సత్యనారాయణ అభినందించారు.



తైక్వాండో జట్టుతో సంఘ కార్యదర్శి అర్జునరావు తదితరులు

నేత్రపర్వంగా భీమేశ్వరస్వామి తెప్పోత్సవం



సామర్లకోటలో భీమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు



పంచారామ క్షేత్రంలోని పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. కార్తిక మాసంలో స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను బ్యాండ్ మేళాలు, వేదమంత్రాల మధ్య ఆలయ కోనేరు వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకువచ్చారు. వివిధ పుష్పాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు పూజాదికాలు నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ఈఓ టి.వెంకట సూర్యనారాయణ, తెప్పోత్సవం నిర్వహించే దాతలు కటకం సతీష్, సురేష్ దంపతులు వేదికపై పూజలు చేశారు. బాణసంచా కాల్పుల మధ్య స్వామి, అమ్మవార్లకు ఆలయ కోనేరులో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. మూడు పర్యాయాలు స్వామివారి జలవిహారం కనుల పండువగా జరిగింది. అనంతరం దాతల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి సేవలందించారు.